403) లలిత

ప॥ హరి హరి నీమహిమ లనంతములు । నిరతి జీవులకెల్ల నేరుపులై వున్నవి ॥

చ॥ యెందరు భోగించినదో యీబ్రహ్మాండము దొల్లి । అందరికి దమతమదై వుండును ।
కందువ నెవ్వ రెవ్వరి కాణాచి యైనదో భూమి । సందడించీ బంటలను సకలసస్యములు ॥

చ॥ చుట్టుక యెందరికిని సొమ్మయినదో కాలము । అట్టె అందరిఆయుష్యమై యున్నది ।
గట్టిగా నెవ్వరెవ్వరి కంచముకూడో యీమాయ । దట్టపుసంసారముల ధర్మములై యున్నవి ॥

చ॥ ముంచి యెందరికైనాను మోపులై వుండీ కర్మము । పంచు కందరి దమ పనిపాటలై ।
పంచుక శ్రీవేంకటేశ వారివారిబ్రదుకులు । నించి నీవే యైతివి నిధినిధానములై ॥